# మచ్చలు

రామ్ డొక్కా

ఎక్కడ లేవు మచ్చలు?
ఎదలను కాల్చిన చిచ్చులు.
ఎవరికి లేవు మచ్చలు?
ఎందుకు మాటల ఉచ్చులు?

మనిషికైనా, మతానికైనా,
సంస్కృతికైనా, దేశానికైనా,
మచ్చల పరిధిని దాటితేనే కదా
మంచితనం కనిపించేది..

చావుపుట్టుకలతో యుద్ధం చేస్తున్నప్పుడు,
జీవితం చరిత్రగా ఎదుగుతున్నప్పుడు,
మనసు పిడికిట్లో బిగుస్తున్నప్పుడు,
మనిషి సత్యంగా మారుతున్నప్పుడు,
మచ్చలు, మరకలు తప్పవు మిత్రమా!

మచ్చలను ఎత్తి చూపకు,
గాయం పెద్దదౌతుంది..
మానవత్వాన్ని గుర్తించి పాడు,
అక్షరం అమృతమౌతుంది..

అంతర్మథనాన్ని అలవాటుచేసుకో,
అది అన్ని మచ్చలను మాపే ఔషధం,
ఆలోచించి దారిని ఎంచుకో,
ఆ పునాదిపై నిలుస్తుంది భవిష్యత్తు సౌధం.. !

★★★

# నిశ్శబ్ద వేదన

అర్చన కోవూరు

రావణుడు పరుషజాలమాడ
సీత ధరియించిన మౌనం ఒక వేదన
దుశ్శాసన చెరబట్టగ శిరసు వంచి
కురుసభనేలిన మౌనం ద్రౌపదియొక్క రోదనం
పితరుల ఆన మీరక రాముడు
వహించిన మౌనం ఒక ఆదర్శం
శిశుపాలుని నూరు తప్పులెన్న
వాసుదేవుడు దాల్చిన మౌనం ఒక ప్రాణం
పుత్ర ప్రీతి కన్నుగప్ప అశక్తుడైన
ధృతరాష్ట్రుడి మౌనం ఒక సమరం
శ్రవణ కుమారుడి ఆక్రందన వెనుక
దశరధుని అసహాయ మౌనం ఒక శాపం

పతి మాటను తల ఎత్తక
నడుచుకున్న సతి మౌనం ఒక బిడియం
ఆనందబాష్పాల హత్తుకొనగ మనసుల
మధ్య సాగే మౌనం ఒక అనురాగం
భుజము తట్టి ఓదార్పు పంచగ
అశ్రునయనాల మౌనం ఒక స్నేహం
కీర్తి శిఖరాల అందుకొనగ
ఎదనిండిన మౌనం ఒక అభిమానం
ఈశ్వరునారాధించ దాసుని
అంతరంగమందునున్న మౌనం ఒక ధ్యానం
ప్రకృతి కాంచి పరవశించ చిత్రకారుని
హృదినాక్రమించిన మౌనం ఒక ఆరాధనం
మధువు గ్రోల దరిచేరిన తేనీగను కావ
సుమమునావహించిన మౌనం ఒక ఆనందం!

అన్యాయము కని కసరలేని
పెదవి చాటు మౌనం ఒక పాపం
అధర్మాన్ని ప్రశ్నించగ గళం
వీడిన మౌనం ఒక ఆవేశం
దొరతనమును నిగ్గదీయ చేతకాని
దమ్ము లేని ప్రజల మౌనం ఒక అవమానం!

ముదము కూర్చగ మౌనమాడుట
మేటి కదరా మిత్రమా
మేలు చేయగ మౌనమన్నది
విలువ చేయును మాటకన్నను,

నీతి విడవగ ప్రాణమొప్పక
శీలమన్నది గతి తప్పి మెలుగగ
మౌనమన్నది కారాదు మాత్రమొక మాట
మౌనమన్నది కాజాలదు సంఘానికొక గరిమ

భాషకందని భావాల సంగమం
నవరసాల సారం ఈ మౌనం
కాలమెరుగదు ఖ్యాతి గాంచదు
హితమునెంచగ నడుచుకొనుటయె
మానవుల యొక్క ధర్మం
లోపమెన్నగ గీత దాటుట
సమాజం యొక్క కర్తవ్యం..!!

★★★

# రంకె

డా.మక్కెన శ్రీను

వాన చినుకు కాచే పగుళ్లు
ఏరువాక సాగేను నాగళ్లు
జోడెడ్లు నిలిచే బారులు
మట్టి స్పర్శకై ఎడ్ల పాదాలు!
నేలంతా పాకిన సాలు ధారలు
నల్ల రేగడిలో పైరు నాట్యాలు
పచ్చని నేల పుట్టిన రతనాలు
పంటలతో ఒలికిన సంతసాలు !
పసిడి పొలాల్లో రేగిన స్వప్నం
యాంత్రిక జీవ కార్చిచ్చు దగ్ధం
కాడిని మింగిన కల్లోల కమతం
దాపటెద్దు గిట్ట చీలిన నిశ్శబ్దం !
పలుగు తాకని పుడమి నిరీక్షణ
వెలుగు రేఖల భవిష్య చీకటి
బక్క బారిన దేహ ధారుఢ్యం
డొక్క చీరిన కాలమాన తీక్షణం !
అలసిన బతుకు పోరాటం
వెలసిన వానకు దాసోహం
ఆంబోతు రంకెలు దుమ్ము రేపే
ఆకుపచ్చ దృశ్య అదృశ్యం !
మరో ఊర్లో ఆంబోతు మోరెత్తింది
అచ్చోసిన తల ఆకాశాన్ని చూసింది
ఆత్మానందం అందులోవున్నట్లుంది
భావ ప్రాప్తికో … అస్కలన భ్రాంతికో !

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఈ యడవినేలనో చరియించుచుంటి
ఇచ్చటే యుండిపోవగానెంచుచుంటి
చెట్టుచేమల నేనొక చెట్టుగాగ
పొదల మధ్యన నేనొక పొదను గాగ

మాటలేవియురావు నా మనసు దాటి
మధురమైనట్టి యూహలు మదిని లేవు
అశ్రుబిందులు కన్నులనసలు లేవు
మనసు చాంచల్యరహితసమాధి మునిగె

పదములును, పదముల దాగు భావములును,
భావముల వెన్క గడచిన జీవితమును
కనుల గట్టిన యట్లౌను కలల వోలె
కలలు కరుగును,కరుగును గతము కూడ

ఇంతటి ప్రశాంతత మదికింకెచట దొరకు
ఇంత యేకాగ్రతయునునేకాంతమున్ను
కరుణ తోడ నాకిచ్చెనీ కాననమ్ము
వీడి యెటకేగుదిదియె నా విశ్వమెల్ల

పూల దారిలో నడచునా వేళ యందు
మధురమౌ యూహలు మెదిలె మనసులోన
విపినమార్గాన నడచునీ వేళ యందు
సుమధురమమధురమను ద్వంద్వములు లేవు

COMMENTS